




# కరపత్రం

SINCE 2014

శుక్రవారం సెప్టెంబర్ 11,2026 సంపుటి : 2 సంచిక : 332 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


# బీఆర్ఎస్ కుట్రలను బలంగా తిప్పికొట్టాలి

- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- సభను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ కుట్ర చేస్తోంది
- అధికారం పోయినా బీఆర్ఎస్ అహంకారం పోలేదు
- పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించడం సరికాదు
- స్పీకర్‌ను అభ్యంతరకరంగా దూషించారని సీఎం ఆగ్రహం
- ఎమ్మెల్యేలు సభకు హాజరై చర్చల్లో పాల్గొనాలి



**హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం అధ్యక్షతన సీఎల్పీ భేటీ జరిగింది. ఈ సమావేశంలో సీఎం పలు సూచనలు చేశారు."వెయ్యి రోజుల పాలనను ప్రజలకు వివరించాలని అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నాం. సభ జరగనివ్వకుండా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కుట్ర చేసింది. ఆ పార్టీకి అధికారం పోయినా అహంకారం పోలేదు. పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించి సభను సజావుగా జరగకుండా చేశారు. మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించారు. స్పీకర్‌ను అత్యంత అభ్యంతరకరంగా దూషించారు. ప్రతిపక్షం కుట్రలను బలంగా తిప్పికొట్టాలి. ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని అభినందిస్తున్నా. ఎమ్మెల్యేలు సభకు హాజరై చర్చల్లో పాల్గొనాలి" అని రేవంత్ దిశానిర్దేశం చేశారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం.. తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన.. ఈ 48 గంటలు కీలకం!




ఉత్తర బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడింది. ఉత్తర బంగాళాఖాతం, బంగ్లాదేశ్‌ను ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో.. 2026 సెప్టెంబర్ 10వ తేదీ ఉదయం 5:30 గంటలకు అల్పపీడనం ఏర్పడినట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది.దీని ప్రభావంతో రానున్న 48 గంటల్లో ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచనున్నాయి. గరిష్ఠంగా గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది.



## బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసు

- కేసులో హరీశ్‌రావు, కేటీఆర్ సహా నలుగురు
- సుధీర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి కూడా నిందితులుగా నమోదు
- మహిళా పోలీసులను అవమానించేలా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలు
- దాడి, బెదిరింపులు, అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు
- అసెంబ్లీ వద్ద పోలీసులతో బీఆర్ఎస్ నేతల వాగ్వాదం
- బ్లాక్ టీషర్ట్‌లతో వచ్చిన నేతలను అడ్డుకోవడంతో ఉద్రిక్తత

2 లో

బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసు నమోదయ్యింది. మహిళా పోలీసులను అవమానించేలా వ్యాఖ్యలు చేశారంటూ ఓ మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేయడంతో గురువారం ( సెప్టెంబర్ 10 ) కేసు నమోదు చేశారు సైఫాబాద్ పోలీసులు. ఈ కేసులో నిందితులుగా హరీష్ రావు, కేటీఆర్, సుధీర్ రెడ్డి, నవీన్ రెడ్డిలను చేర్చారు పోలీసులు.



## బయట బీఆర్ఎస్.. సభలో బీజేపీ అలజడి

- రెండు పార్టీలు సభా సమయాన్ని వృథా చేస్తున్నాయి
- ఇప్పటికే 3 రోజులు వృథా చేశారన్న ప్రభుత్వ విప్
- ప్రజా సమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- స్పీకర్ అవమానంపై చర్చకు బీఆర్ఎస్ వెనుకంజ
- 22ఏపై చర్చకు బీజేపీ గందరగోళం సృష్టిస్తోందని ఆరోపణ

**హైదరాబాద్:** బయట భారాస.. సభ లోపల భాజపా గందరగోళం సృష్టిస్తున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. రెండు పార్టీలు సభా సమయాన్ని వృథా చేస్తున్నాయని మండిపడ్డారు."ప్రజా సమస్యలపై చర్చలు జరిపి పరిష్కారాలు కనుగొనాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే.. రెండు పార్టీలు కుయుక్తులు పన్ని సభలో అలజడి సృష్టిస్తున్నాయి. ఇప్పటికే 3 రోజులు వృథా.. ప్రజా సమస్యల కంటే ఫక్తు రాజకీయాలు చేసే యత్నం మాను కోవాలి. స్పీకర్‌పై జరిగిన అవమానంపై చర్చ జరపాలంటే బీఆర్ఎస్ చర్చించదు. 22ఏపై చర్చ జరపాలంటూ సభలో గందరగోళం సృష్టించేందుకు భాజపా యత్నిస్తోంది. ప్రతి ప్రజా సమస్యపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని ఆది శ్రీనివాస్ తెలిపారు.

## అప్పుడే ఇరాన్ యుద్ధం ముగుస్తుంది: డొనాల్డ్ ట్రంప్

అమెరికాలో మధ్యంతర ఎన్నికలు పూర్తయిన తర్వాతే ఇరాన్‌తో యుద్ధం ముగుస్తుందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. 100 డాలర్లకు చేరిన చమురు ధరలు కూడా అప్పుడే తగ్గుతాయని అంచనా వేశారు. హర్మూజ్ జలసంధిలో అమెరికా బలగాలు తమ పోరాటాన్ని ఉధృతం చేయడంతో.. టెహ్రాన్ ఇక ఎక్కువకాలం దాడులను తట్టుకోలేదని వ్యాఖ్యానించారు. తమ మధ్యంతర ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.



మిగతాది 2లో

## రూ.5 లక్షలు సరిపోవు.. సాయం పెంచాలి



2 లో

- నిర్మాణ ఖర్చు రూ.12 లక్షల వరకు పెరిగింది
- లేబర్ ఖర్చే రూ.3 లక్షలు అవుతోంది
- ఇళ్ల కోసం బంగారం అమ్ముకుంటున్న పేదలు
- ఇళ్ల సంఖ్య తగ్గించినా.. ఒక్కో ఇంటికి సాయం పెంచాలి
- ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో వర్గాల వారీ వాటా స్పష్టం చేయాలి: అక్బరుద్దీన్
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎంత శాతం?

**హైదరాబాద్:** తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న రూ.5 లక్షల సాయం సరిపోవడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అన్నారు. నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో రూ.5 లక్షలతో పూర్తయ్యే ఇల్లు ప్రస్తుతం రూ.12 లక్షల వరకు ఖర్చవుతోందని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం అందిస్తున్న సాయం పెంచాలని సూచించారు.

## చెరువుల్లో నిమజ్జనాలకు మేం వ్యతిరేకం కాదు: హైడ్రా కమిషనర్ రంగనాథ్



2లో..

## 46 చోట్ల టీజీ సేఫ్ అధికారుల దాడులు.. పురుగులు పట్టిన ఆహారం గుర్తింపు

**హైదరాబాద్:** తెలంగాణలోని పలు హోటళ్లు, స్వీట్‌షాప్‌లు, హాస్టళ్లు, రెస్టారంట్లు, బేకరీలు, దాబాలపై టీజీ సేఫ్ స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. కోర్ అర్బన్ రీజియన్ వెలుపల పలు జిల్లాల్లోని 46 ఆహార సంస్థల్లో అధికారులు తనిఖీలు చేశారు. పలుచోట్ల కల్తీ, కలుషిత మాంసం, కుళ్లిపోయిన కూరగాయలను గుర్తించారు.



2లో..

## హద్దులు ఉండాల్సిందే..

### చిన్నారుల సోషల్ మీడియా వినియోగంపై సుప్రీం

**ఇంటర్నెట్‌డెస్క్:** చిన్నారులు సోషల్ మీడియా వినియోగంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పిల్లలు డిజిటల్ వేదికలను సులభంగా వినియోగించే అవకాశం ఉందని, అందుకే వారికి రక్షణ కల్పించేలా హద్దులు ఉండాల్సిందేనని సూచించింది. మైనర్లు సామాజిక మాధ్యమాలు, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను వినియోగించే విషయంలో రక్షణ కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఆన్‌లైన్ వేధింపుల నుంచి చిన్నారులను రక్షించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటుందో తెలియజేయాలని కేంద్రానికి నోటీసులు జారీ చేసింది.






## ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. రేవంత్ వైఫల్యం: హరీశ్‌రావు

- రైతులకు 7--8 గంటల కరెంట్ కూడా రావడం లేదు
- నీళ్లు ఇవ్వలేరు.. కరెంట్ ఇవ్వలేరు: హరీశ్
- భద్రాద్రి కొత్తగూడెం పవర్ ప్లాంట్ ఎందుకు బంద్ చేశారు?
- యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడపలేకపోతున్నారు
- రైతుల కష్టాలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆరోపణ

హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి ఇచ్చేందుకు పవర్ లేదని, ప్రతి పక్షాల పీక నొక్కేందుకు మాత్రం కాంగ్రెస్‌కు పవర్ ఉందా? అని నిలదీశారు మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు. రాష్ట్ర రైతులకు కనీసం ఇప్పుడు 7 నుంచి 8 గంటల కరెంట్ కూడా రావడం లేదని హరీష్‌రావు విమర్శించారు.

## హైదరాబాద్‌లో ఆర్టీసీ బస్సు బీభత్సం.. పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లి..



2లో

## సచివాలయంలో ఏసీబీ సోదాలు

- » లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబాటు
- » సీఎం రిలీఫ్ ఫండ్ కోసం రూ.లక్ష లంచం డిమాండ్
- » సెక్షన్ ఆఫీసర్ వినోద్ అరెస్ట్
- » ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాఘవేంద్ర కూడా అదుపులోకి
- » ఇద్దరినీ నాంపల్లి ఏసీబీ కార్యాలయానికి తరలింపు




2లో..

**హైదరాబాద్:** తెలంగాణ సచివాలయంలో ఏసీబీ సోదాలు జరిగాయి. సెక్రటేరియట్ ఆవరణలోని టెంపుల్ దగ్గర లంచం తీసుకుంటుండగా ఒకరిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం సెప్టెంబర్ 11,2026

## రూ.5 లక్షలు సరిపోవు..
# సాయం పెంచాలి

మొదటి పేజీ తరువాయి
కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తాజాగా మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోక పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ఇళ్ల నిర్మాణం కోసం తమ భార్యల బంగారం కూడా అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణంలోనే లేబర్ కాస్ట్ దాదాపు రూ.3 లక్షల వరకు అవుతోంది. అందువల్ల ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల సాయాన్ని పెంచే అంశాన్ని పరిశీలించాలని కోరారు. ఇళ్ల సంఖ్య కొంత తగ్గించినా ఫర్వాలేదని, అయితే ఒక్కో ఇంటికి ఇచ్చే ఆర్థిక సాయాన్ని పెంచాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.
కాగా, ప్రస్తుతం ప్రభుత్వం సొంత స్థలం ఉన్న అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోంది. మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో సామాజిక వర్గాల వారీగా కేటాయింపులపై ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ ప్రశ్నలు లేవనెత్తారు. గతంలో వైఎస్సార్ ప్రభుత్వం మైనార్టీలకు ప్రత్యేకంగా ఇళ్ల కేటాయింపుపై జీవో ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం రెండు లక్షల ఇళ్లు ఇస్తామని చెబుతోందని, ఆ రెండు లక్షల ఇళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎంత శాతం కేటాయిస్తున్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

# సచివాలయంలో ఏసీబీ సోదాలు

మొదటి పేజీ తరువాయి
దొరికిన వ్యక్తి మరొక వ్యక్తి పేరు చెప్పడంతో ప్రస్తుతం ఒక అధికారిని నాంపల్లి ఏసీబీ కార్యాలయంలో విచారణ చేస్తున్నారు. మరొక అధికారి ఉన్నట్టు సమాచారం. ఇంకా సెక్రటేరియట్ లో సోదాలు కొనసాగుతున్నాయి. తెలంగాణవార్తలు
సీఎం రిలీఫ్ ఫండ్ విషయంలో అధికారి రెండు లక్ష రూపాయలకు గాను లక్ష రూపాయల లంచం డిమాండ్ చేశారు. లక్ష రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు సదరు అధికారిని అదుపులోకి తీసుకున్నారు. సచివాలయంలోని సెక్షన్ ఆఫీసర్ వినోద్?తో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగి రాఘవేంద్రలను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నాంపల్లి ఏసీబీ కార్యాలయానికి తరలించి అధికారులు విచారిస్తున్నారు.

## హైదరాబాద్‌లో ఆర్టీసీ బస్సు బీభత్సం..
# పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లి..

మొదటి పేజీ తరువాయి
నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని బాటసింగారం వద్ద ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. ఆటోను తప్పించబోయి పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లింది. దిల్‌సుఖ్‌నగర్ డిపోనకు చెందిన బస్సు చౌటుప్పల్ వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ కారు పూర్తిగా ధ్వంసం కాగా.. మరో వాహనం దెబ్బతింది. డీజిల్ పంపు వద్దకు దూసుకెళ్లడంతో దానికి సంబంధించిన పరికరాలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ ప్రమాదంతో బంక్ సిబ్బంది, అక్కడ ఉన్నవారు తీవ్ర భయాందోళనకు గురై పరుగులు తీశారు. అతివేగం కారణంగా బస్సు అదుపుతప్పినట్లు సమాచారం. దీనికి సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో రికార్డయ్యాయి.?

# బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసు.. నిందితులుగా హరీశ్‌రావు, కేటీఆర్, సుధీర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి...

మొదటి పేజీ తరువాయి
మహిళా పోలీసులను అవమానించారన్న ఫిర్యాదు మేరకు BNS 74, 75(1)(3), 79, BNS 121(1), 190, 132, BNS 296, 351(2), 352, దీచీూ 3(5) సెంక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు పోలీసులు.
దాడి, బెదిరింపులు, అసభ్య ప్రవర్తన ఆరోపణల కింద కేసు నమోదు చేశారు పోలీసులు.విధులకు ఆటంకం కలిగించారని... మహిళా పోలీసులను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొంది బాధితురాలు.
తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల ప్రారంభం రోజున బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నానా హంగామా సృష్టించారు. బ్లాక్ టీ షర్ట్స్ తో వచ్చిన నేతలను అసెంబ్లీలోకి అనుమతించకపోవడంతో పోలీసులపై రెచ్చిపోయారు బీఆర్ఎస్ నేతలు. పోలీసులను తోసుకుంటూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తతకు దారి తీసింది.

# ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. రేవంత్ వైఫల్యం: హరీశ్‌రావు

మొదటి పేజీ తరువాయి
(గురువారం, సెప్టెంబర్ 10వ తేదీ) తెలంగాణ భవన్ నుంచి మాట్లాడిన హరీష్‌రావు.. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యంతో తెలంగాణ రైతాంగ కష్టాలు చూడాల్సి వస్తుందన్నారు.
'ఒకవైపు నీళ్లు ఇవ్వలేవు.. కరెంట్ ఇవ్వలేవు.. ఇది మీ పరిపాలనా వైఫల్యం కాదా?' అని ప్రశ్నించారు. అసలు రైతులకు ఎందుకు కరెంట్ ఇవ్వలేకపోతున్నారని సూటిగా నిలదీశారు. భద్రాద్రి, కొత్తగూడెం పవర్ ప్లాంట్ ఎందుకు బంద్ చేశావ్ రేవంత్ అని ప్రశ్నించారు. ఇక యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని పూర్తి స్థాయిలో నడపలేకపోతుంది ఈ ప్రభుత్వం అంటూ ధ్వజమెత్తారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, రేవంత్ పరిపాలనా వైఫల్యమని హరీష్ మండిపడ్డారు.

## 46 చోట్ల టీజీ సేఫ్ అధికారుల దాడులు..
# పురుగులు పట్టిన ఆహారం గుర్తింపు

మొదటి పేజీ తరువాయి
పలు ఆహార పదార్థాలపై బొద్దింకలు, ఈగలు, ఎలుకలు తిరుగుతుండడాన్ని గుర్తించారు. పలు చోట్ల శుభ్రత లేని రిఫ్రిజిరేటర్లు, ఒకేచోట వెజ్, నాన్‌వెజ్ ఆహారం పక్కపక్కనే కలిపి ఉంచడం వంటివి తనిఖీలో బయటపడ్డాయి. ఆహార పదార్థాలకు సరైన లేబులింగ్‌లు లేకుండా గడువు ముగిసిన, పురుగులు పట్టిన పదార్థాలను అధికారులు గుర్తించారు.
ఫుడ్ హ్యాండ్లర్లు సరైన వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడంపై అధికారుల ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమానం ఉన్న 22 ఆహార నమూనాలను సేకరించారు. కుళ్లిపోయిన కూరగాయలు, పురుగులు పట్టిన ఆహార పదార్థాలను పారబోశారు. నిబంధనల ఉల్లంఘనలపై 23 సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు ఇచ్చారు. ప్రజారోగ్య ప్రయోజనాల దృష్ట్యా 3 సంస్థల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు సస్పెండ్ చేశారు. వెంటనే వ్యాపార కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్ ఘన్‌పూర్‌లోని మహేంద్ర మీల్స్, బిర్యానీ అండ్ కర్రీ పాయింట్‌లో, కరీంనగర్ బావ్‌పేటలోని శ్రీ బాలాజీ మ్యాజిక్ మిఠాయి దుకాణంలో, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ చీం-65లోని చాచా ఫ్యామిలీ దాబాలో అధికారులు తనిఖీలు చేశారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# బ్రిక్స్ సదస్సు: సస్పెన్స్‌కు తెర.. భారత్‌కు జిన్‌పింగ్!



చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్ పర్యటన విషయంలో కొనసాగుతోన్న సస్పెన్స్‌కు తెరపడింది. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఆయన భారత్‌కు రానున్నారు. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వ రంగ మీడియా సంస్థ జిన్హువా వెల్లడించింది.
దేశ రాజధాని దిల్లీలోని భారత్ మండపంలో ఈ నెల 12, 13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు మిగతా సభ్య దేశాల అగ్రనేతలు హాజరవుతుండగా.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రాకపై మాత్రం తొలి నుంచి సందిగ్ధతే నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే, తమకు కూడా ఎలాంటి అధికారిక సమాచారం లేదని అంతకుముందు చైనా విదేశాంగ శాఖ చెప్పడంతో.. అసలు జిన్‌పింగ్ బ్రిక్స్ సదస్సుకు వస్తారా? లేదా? అనే అంశంపై సందిగ్ధత నెలకొంది. చివరకు జిన్‌పింగ్ పర్యటనపై చైనా అధికారిక మీడియా నుంచి ప్రకటన వెలువడడం గమనార్హం.
భారత్-చైనా మధ్య దశాబ్దాలుగా సరిహద్దు విభేదాలు నెలకొన్నాయి. 1962లో యుద్ధం వీటికి నాంది పలికిందని చెప్పొచ్చు. 2020లో గల్వాన్ ఘర్షణతో అవి మరింత తీవ్రరూపం దాల్చాయి. అయితే ఈ మధ్యకాలంలో రెండు దేశాలు కాస్త పట్టువిడుపులు ప్రదర్శిస్తున్నట్లు కనిపిస్తోంది. గతేడాది షాంఘై సహకార సదస్సు కు ప్రధాని మోదీ హాజరైన సంగతి తెలిసిందే. ఇక ఈ బ్రిక్స్ సదస్సుకు ముందు మోదీ, జిన్‌పింగ్ ప్రత్యేకంగా భేటీ అయి ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## లంచ్‌కు ఆహ్వానించిన అమృతా ఫడణవీస్..
# జరాంగే ఏమన్నారంటే!



మరాఠా రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న మనోజ్ జరాంగే చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష 13వ రోజుకు చేరుకుంది. దీంతో ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు వైద్య నివేదికలు వెల్లడించాయి. ఈ క్రమంలో నాగ్‌పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సతీమణి అమృతా ఫడణవీస్ మీడియాతో మాట్లాడుతూ.. మనోజ్ జరాంగేను సోదరుడిగా భావిస్తున్నానని, ఆయన్ను భోజనానికి తమ ఇంటికి రావాల్సిందిగా ఆహ్వానిస్తున్నానని అన్నారు.
సీఎం సతీమణి ఆహ్వానంపై జరాంగే స్పందించారు. ఆమె నివాసానికి వెళ్లేందుకు ఇది సరైన సమయం కాదన్నారు. ఓ సోదరిగా అభిమానంతో పిలిస్తే మాత్రం.. ఆమె ఆహ్వానాన్ని అంగీకరిస్తానని అన్నారు. అయితే, దీపావళి తర్వాత చేసుకునే 'భావ్‌బీజ్'కు తప్పకుండా వస్తానని అన్నారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా మహారాష్ట్రలో ఈ పండగ చేసుకుంటారు. అయితే, రిజర్వేషన్ కోటా డిమాండ్లను నెరవేర్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు త్వరలో చలో ముంబయి కార్యక్రమాన్ని చేపట్టి తీరతామని జరాంగే స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి సెప్టెంబర్ 12న కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు.
గతేడాది ఆగస్టు 29న ముంబయిలోని ఆజాద్ మైదానంలో జరాంగే ఐదు రోజుల నిరసన కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో స్పందించిన ప్రభుత్వం.. కొన్ని డిమాండ్లను అంగీకరించడంతో ఉద్యమ నేత ఆందోళనలను విరమించారు. మిగిలిన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ జాల్నా జిల్లాలో గత నెల 29న జరాంగే మరోసారి నిరాహార దీక్ష చేపట్టారు. ఆరోగ్యం క్షీణిస్తుండడంతో పలువురు మంత్రులు ఫోన్‌లో మాట్లాడిన అనంతరం ఐవీ ఫ్లూయిడ్స్ తీసుకునేందుకు ఉద్యమ నేత అంగీకరించారు.

# అప్పుడే ఇరాన్ యుద్ధం ముగుస్తుంది: డొనాల్డ్ ట్రంప్

మొదటి పేజీ తరువాయి
హర్మూజ్ జలసంధి లో ఇరాన్ సరికొత్త నిబంధనలను ప్రకటించింది. అమెరికా మద్దతుతో జలసంధిలో అసురక్షిత మార్గంలో ప్రయాణిస్తోన్న నౌకలను ఆంక్షల జాబితాలో చేరుస్తామని వెల్లడించింది. ఈ క్రమంలోనే ఇటీవల యూఎస్ నౌకలు, 8 ట్యాంకర్లపైన ఐఆర్‌జీసీ దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ట్రంప్ స్పందిస్తూ.. ఇరాన్‌పై విమర్శలు గుప్పించారు. మరోవైపు, అమెరికా కూడా టెహ్రాన్ నౌకలను లక్ష్యంగా చేసుకుంటోంది. దాంతో జోర్డాన్‌లోని యూఎస్ స్థావరంపై ఇరాన్ ప్రతిదాడులు చేసింది. ఈ ఘటనలతో హర్మూజ్‌లో నౌకల రవాణా మరోసారి ప్రమాదంలో పడింది. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు బ్యారెల్ ధర 100 డాలర్లు దాటింది. కాగా.. తాము ఇరాన్‌తో చర్చలు కోరుకోవడం లేదని, అయితే ఒప్పందం కుదుర్చుకునే అంశాన్ని మాత్రం పక్కనపెట్టలేదని ట్రంప్ వ్యాఖ్యానించడం గమనార్హం.
జోర్డాన్‌లోని అమెరికా స్థావరంపై ఇరాన్ దాడులు చేయడంతో పలు సైనిక విమానాలు దెబ్బతిన్నాయని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఏ-10 థండర్‌బోల్ట్ విమానంతో పాటు ఎనిమిది ఎఫ్-15 యుద్ధ విమానాలు స్వల్పంగా దెబ్బతిన్నాయని పేర్కొంది. ఇరాన్ దాడులను అడ్డుకునేందుకు అమెరికా బలగాలు 30 పాట్రియాట్ క్షిపణులను మోహరించాయని తెలిపింది. జోర్డాన్‌లోని ఎయిర్‌బేస్ నుంచి పదుల సంఖ్యలో అమెరికా విమానాలు పనిచేస్తున్నాయి. ఇరాన్ యుద్ధంలో ఈ బేస్ కీలకంగా మారింది.

## 15వేల మంది పోలీసులు..
## 500 సీసీటీవీలు.. బ్రిక్స్ సదస్సుకు భారీ భద్రత

బ్రిక్స్ సదస్సు కు దేశ రాజధాని దిల్లీ నగరం సిద్ధమైంది. ఈనెల 12, 13 తేదీల్లో ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు ప్రపంచ దేశాల అగ్రనేతలు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో దిల్లీ అధికారులు, పోలీసులు అప్రమత్తమయ్యారు. నగరంలో భారీగా భద్రతను పెంచారు. దాదాపు 15 వేల మంది పోలీసులను రంగంలోకి దించారు. 200 పారామిలటరీ కంపెనీలను మోహరించారు. విమానాశ్రయాలు, హోటళ్లు, భారత్ మండపం సహా కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. నేతలు బస చేసే పలు హోటళ్ల వద్ద ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేశారు.నగరంలోని కీలక ప్రాంతాల్లో నిఘా కోసం సుమారు 500 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అనుమానాస్పద కదలికలను గుర్తించేందుకు ఆధునిక నిఘా వ్యవస్థలను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. వైమానిక ముప్పును ఎదుర్కొనేందుకు యాంటీ డ్రోన్ వ్యవస్థలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ సహా పలువురు దేశాధినేతలు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. వీఐపీ కాన్వాయ్‌ల రాకపోకల కోసం అధికారులు ప్రత్యేక మార్గాలను ఖరారు చేశారు.

## ఆ వీడియోలను నమ్మి మోసపోవద్దు
## - ప్రియాంక కార్యాలయం హెచ్చరిక



కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా పేరుతో సామాజిక మాధ్యమాల్లో నకిలీ వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. కృత్రిమ మేధ సాయంతో ఆమె ఫొటోలు, వాయిస్‌ను ఉపయోగించి ఈ వీడియోలు రూపొందించారు. పలు సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలంటూ ప్రియంకా స్వయంగా చెబుతున్నట్లు ఆ వీడియోల్లో ఉంది. ఈ నకిలీ వీడియోలపై ఆమె కార్యాలయం స్పందించింది. వాటిని నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించింది. ఏఐతో రూపొందించిన ఆ వీడియోలు మోసపూరితమైనవని స్పష్టం చేసింది. వాటిలోని లింకులపై క్లిక్ చేయొద్దని, ఎలాంటి పెట్టుబడులు పెట్టొద్దని సూచించింది. ఇలాంటి పోస్టులు కనిపిస్తే వెంటనే ఫిర్యాదు చేసి.. బ్లాక్ చేయాలని కోరింది.

# చెరువుల్లో నిమజ్జనాలకు మేం వ్యతిరేకం కాదు: హైడ్రా కమిషనర్ రంగనాథ్

మొదటి పేజీ తరువాయి
నగరంలో గణేశ్ నిమజ్జనాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. చెరువుల్లో నిమజ్జనాలకు హైడ్రా వ్యతిరేకం కాదన్నారు. సోషల్ మీడియాలో హైడ్రా పై దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు."కేంద్రం నోటిఫై చేసిన 4-5 చెరువుల్లోనే గణేశ్ నిమజ్జనంపై ఆంక్షలు ఉన్నాయి. అమీన్‌పూర్, కాప్రా చెరువుల్లో ఆంక్షలు విధించారు. దేశంలో ప్రప్రథమంగా అమీన్‌పూర్ చెరువును బయోడైవర్సిటీగా, నేచురల్ వెట్‌ల్యాండ్ కింద కాప్రా చెరువును కేంద్రం గుర్తించింది. హైడ్రా పునరుద్ధరిస్తున్న చెరువుల వద్ద ఎలాంటి ఆంక్షలు లేవు. మట్టి విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం. పీవోపీ విగ్రహాల నిమజ్జనం కోసం ప్రతి చెరువు వద్ద ప్రత్యేక స్థలం కేటాయిస్తున్నాం"అని రంగనాథ్ తెలిపారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం.. తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన.. ఈ 48 గంటలు కీలకం!

మొదటి పేజీ తరువాయి
బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశాతో పాటు ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల్లోనూ ఈ ప్రభావం ఉండే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. అలాగే ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో సముద్రం అలజడిగా ఉంటూ తీవ్ర అలజడిగా మారే అవకాశం ఉందని తెలిపింది.
దీంతో రానున్న 48 గంటల్లో మత్స్యకారులు ఉత్తర, మధ్య బంగాళాఖాతంలోకి.. అలాగే బంగ్లాదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల వెంబడి సముద్రంలోకి వెళ్లొద్దని ఐఎండీ సూచించింది. ఈ అల్పపీడన ప్రభావం ప్రస్తుతానికి రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలపై పెద్దగా ఉండదని పేర్కొంది. తెలంగాణవార్తలు
ముఖ్యంగా ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల ప్రజలు, మత్స్యకారులు వాతావరణ శాఖ హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు.

# పనులు ఇంత ఆలస్యంగానా..? సిగ్గుగా ఉంది: గడ్కరీ



ముంబయి-గోవా జాతీయ రహదారి విస్తరణ పనులు ఏళ్లుగా సాగుతుండటంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు ఇంత ఆలస్యం కావడం సిగ్గుగా ఉందన్నారు. అందుకే రహదారి ప్రారంభోత్సవానికి హాజరుకాబోనన్నారు. గోవాలోని పోర్వోరిమ్‌లో ఆరు వరుసల ఎలివేటెడ్ కారిడార్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ముంబయి-గోవా రహదారి నిర్మాణంలో పలువురు కాంట్రాక్టర్లు విఫలమయ్యారని చెప్పారు. బాధ్యతగా పనిచేయని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెద్ద సంఖ్యలో కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడంతో పాటు అధికారులను సస్పెండ్ చేసి రికార్డు సృష్టించాలనుకుంటున్నానని పేర్కొన్నారు. ఆ దిశగా కఠిన చర్యలకు వెనకాడబోనని తెలిపారు. ప్రాజెక్టు విషయంలో ఇంతకాలం ఎదురుచూసినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదని గడ్కరీ ఆవేదన వ్యక్తం చేశారు. పనులు త్వరగా పూర్తయ్యేలా సంబంధిత విభాగాలు రెట్టింపు వేగంతో పనిచేయాలని సూచించారు. ఈ విస్తరణ పనులు 2016లోనే పూర్తికావాల్సి ఉంది. భూసేకరణ, పర్యావరణ అనుమతులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వంటి కారణాలతో గడువులు పలుమార్లు దాటిపోయాయి. ప్రస్తుతం పనులు 93-94 శాతం పూర్తయ్యాయని గడ్కరీ తెలిపారు. అక్టోబరులో పనులను స్వయంగా పరిశీలిస్తానని చెప్పారు. రహదారి పనుల్లో నాణ్యతపై రాజీ ఉండకూడదని ఆదేశించారు.

# సాలె గూడు లాంటి పన్నుల విధానం స్థానంలో
# ఒకే దేశం ఒకే పన్ను అనే విధానం కావాలి!

**బోయిని సత్యనారాయణ, అడ్వకేట్**

▪ సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ భారతదేశ ప్రస్తుత పన్ను విధానం, దానివల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు మరియు దానికి ప్రత్యామ్నాయంగా "వన్ నేషన్ వన్ టాక్స్" ఒకే దేశం ఒకే పన్ను అనే సరికొత్త విధానాన్ని ప్రవేశపెట్టడానికి ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కోరుతూ TDS వ్యతిరేక పిల్ సుప్రీంకోర్టులో దాఖలు చేశారు.

**రిట్ పిటిషన్ (సివిల్) No. 20/2025 ద్వారా దాఖలు చేసిన ఈ కేసు అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ v/s యూనియన్ ఆఫ్ ఇండియా గా రికార్డుల్లో రిపోర్ట్ అయింది.**

▪ ప్రస్తుతం ఉన్న TDS విధానం రాజ్యాంగ విరుద్ధంగా, ఏకపక్షంగా ఉందనేది ఆయన వాదన.

అశ్విని ఉపాధ్యాయ గారు సుప్రీం కోర్టులో దాఖలు చేసిన ఇతర కేసులు కూడా విచారణలో ఉన్నాయి.

**వన్ నేషన్ వన్ పీనల్ కోడ్,వన్ నేషన్ వన్ ఎలక్షన్,యూనిఫార్మ్ సివిల్ కోడ్.. లాంటి చర్చకు వస్తున్న విషయాలు ఉపాధ్యాయ గారి వల్లే.**

▪ ప్రస్తుత పన్ను విధానంపై అసంతృప్తి

**సమాజ అభివృద్ధిని ఎలా కొలుస్తారు? వ్యవస్థ సంక్లిష్టంగా ఉంటే దాన్ని ఏమనాలి? సైన్స్, టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి జీవితాన్ని సులభతరం చేయడమే కదా అసలు ఉద్దేశం?**

**కానీ ఈ రోజు దేశవ్యాప్తంగా వ్యాపారవేత్తలు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆదాయపు పన్ను ఫైల్ చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.**

ప్రభుత్వం "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" అని చెప్తున్నప్పటికీ, ఈ పన్నుల లెక్కలతో అందరి పరిస్థితి దారుణంగా ఉంది.

▪ ప్రధానమంత్రి మోదీ ఎర్రకోట నుంచి "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" తో పాటు "ఈజ్ ఆఫ్ లివింగ్" సరళతర జీవనం కూడా ముఖ్యమని ప్రకటించారు.

ఇందు కొరకు పన్నుల వ్యవస్థ చాలా సరళంగా ఉండా లని, న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ గారు అన్నారు. ఆయన ఒక ప్రత్యేకమైన "వన్ నేషన్ వన్ టాక్స్" ఫార్ములాను సిద్ధం చేశారు.

▪ ప్రభుత్వం "వన్ నేషన్ వన్ ఎలక్షన్" ప్రతిపాదనకు... అశ్విని ఉపాధ్యాయ ప్రతిపాదిస్తున్న "వన్ నేషన్ వన్ టాక్స్" కు సంబంధం లేదు.

**చాణక్యుడి కాలం నాటి ఆర్థిక వ్యవస్థ**
భారతదేశ చరిత్రలోనే అత్యధిక జీడీపీ ఆచార్య చాణక్యుడి కాలంలో ఉంది.

ఆ సమయంలో దేశంలో టోల్ టాక్స్, రోడ్ టాక్స్, వ్యాట్, టీడీఎస్, జీఎస్టీ లేదా ఇన్‌కమ్ టాక్స్ వంటి పన్నులు ఏవీ లేవు..గతంలో భారతదేశాన్ని "బంగారు పిచ్చుక" ... సోనే కీ చిడియా అని పిలిచేవారు. మన దేశం మళ్లీ "బంగారు పిచ్చుక" గా మారాలి.

**అప్పుడు భారత్ జీడీపీ 40% గా ఉండేది.**

కానీ ఈ రోజు పన్నుల పెద్ద సాలె గూడు మాదిరిగా ఉన్నప్పటికీ భారతదేశం అప్పుల పాలైంది, కనీసం 10% జీడీపీని కూడా అందుకోలేక పోతున్నాము.

**ఈ భారీ చట్టాల వల్ల మిడిల్ క్లాస్, అప్పర్ క్లాస్, బిజినెస్ క్లాస్ అని తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఇబ్బంది పడుతున్నారు.**

ప్రభుత్వం వ్యాట్, టీడీఎస్, జీఎస్టీ, ఇన్‌కమ్ టాక్స్ అంటూ ఎన్నో డిపార్ట్‌మెంట్‌లను సృష్టించింది. అయినా అవినీతి తగ్గలేదు, ప్రజల కష్టాలు తీరలేదు.

▪ కేవలం విదేశాల నుండి వచ్చే దిగుమతి-ఎగుమతులపై విధించే కస్టమ్స్ పన్ను మినహా, భారతదేశం లోపల ఉన్న అన్ని రకాల




పన్నులను రద్దు చేయాలి.

**మన సంపాదనపై ఆదాయపు పన్ను కడుతున్నప్పుడు, మళ్లీ ఖర్చులపై జీఎస్టీ ఎందుకు కట్టాలి?**

వాహనం కొనేటప్పుడు రోడ్ టాక్స్ కడితే, మళ్లీ రోడ్డుపై వెళ్లేటప్పుడు టోల్ టాక్స్ ఎందుకు వసూలు చేయాలి? ఇది ప్రజల రక్తాన్ని పిండడమే.

అశ్విని ఉపాధ్యాయ్ గారు అవినీతిని, పన్నుల భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం మూడు పనులు చేయాలని ప్రతిపాదించారు.

▪ 100 కంటే పెద్ద నోట్లను రద్దు చేయాలి

దేశంలో 80% మంది ప్రజలు - 100 కంటే తక్కువ ఖర్చు చేస్తారు. మిగిలిన 20% మంది దగ్గర ఏటీఎం, యూపీఐ, క్రెడిట్/డెబిట్ కార్డులు ఉన్నాయి. కాబట్టి ఎవరికీ పెద్ద నోట్ల అవసరం లేదు.

▪ **1,000 కంటే ఎక్కువ నగదు లావాదేవీలను నిషేధించాలి**

దీనివల్ల నల్లధనం .. Black Money చలామణి పూర్తిగా ఆగిపోతుంది.

▪ **10,000 పైబడిన ప్రతి లావాదేవీని ఆధార్‌తో లింక్ చేయాలి**

దేశంలో ఇప్పటికే 144 కోట్ల మందికి ఆధార్ ఉంది, పేదలు సైతం బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానమయ్యారు.

**బ్యాంకింగ్ ట్రాన్సాక్షన్ టాక్స్**
అన్ని పన్నులు, డిపార్ట్‌మెంట్‌లు రద్దు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం ఎక్కడి నుండి వస్తుంది? ప్రభుత్వం ఎలా నడుస్తుంది? అనే ప్రశ్నకు అశ్వినిఉపాధ్యాయ్ గారు కొత్త ఫార్ములా సూచించారు.

▪ ప్రభుత్వం కేవలం 2% బ్యాంకింగ్ ట్రాన్సాక్షన్ టాక్స్ (BTT) విధిస్తే సరిపోతుంది. - 1,000 వరకు చేసే లావాదేవీలపై ఎలాంటి పన్ను ఉండ కూడదు.

**అంతకంటే ఎక్కువ లావాదేవీలపై మాత్రమే 2% పన్ను పడుతుంది ..ఉదాహరణకు -10,000 వస్తువు కొంటే -200 పన్ను, 1 లక్ష వస్తువు కొంటే -2,000 పన్ను.**

▪ దీనివల్ల వ్యాపారస్తులకు అకౌంటెంట్లు, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లు ఉంచుకోవాల్సిన అవసరం ఉండదు, అడ్వాన్స్ టాక్స్ చెల్లించే తలనొప్పి తప్పుతుంది.అన్నారు.

ప్రజలు కూడా ప్రశాంతంగా, సంతోషంగా ఈ 2% పన్ను కడతారు.నేను చేసిన లెక్కల ప్రకారం, ఈ విధానం ద్వారా ప్రభుత్వ ఆదాయం ఒకటిన్నర రెట్లు (1.5 రెట్లు) పెరుగుతుంది అని అశ్విని ఉపాధ్యాయ అన్నారు.

**ఇన్‌స్పెక్టర్ రాజ్, అధికారుల అవినీతి, వ్యాపారుల వేధింపులు, అవినీతి పూర్తిగా అంతమవుతాయి అన్నారు.**

**నగదు రద్దుతో నేరాల నిర్మూలన**
సమాజంలో జరిగే లంచగొండితనం, కమిషన్లు, దళారీ వ్యవస్థ, హవాలా, డ్రగ్స్, మానవ అక్రమ రవాణా, బంగారు స్మగ్లింగ్, ల్యాండ్ మాఫియా, తీవ్రవాదం, ఓట్ల కొనుగోలు, దొంగతనాలు, కిడ్నాప్‌లు.. ఇవన్నీ కేవలం నగదు రూపంలోనే జరుగుతాయి.

▪ మన పెద్దలు కారణమే లేనప్పుడు కార్యం జరగదు అన్నట్లు, ఎప్పుడైతే పెద్ద నోట్లను, నగదు లావాదేవీలను బంద్ చేస్తామో, అప్పుడు ఈ నేరాలన్నీ ఆటోమేటిక్‌గా ముగిసిపోతాయి. ఐదేళ్లలో దేశంలో 'రామరాజ్యం' వస్తుంది అన్నారు.

**ప్రస్తుత ఆదాయపు పన్ను చట్టంలో ఎన్నో లోపాలు ఉన్నాయి. కొందరు రాజకీయ నాయకులు, అధికారులు -10 కోట్లతో భూమి కొని, మిగిలిన -90 కోట్లను వ్యవసాయ ఆదాయం .. Agricultural Income కింద చూపించి తమ -100 కోట్ల నల్లధనాన్ని సులభంగా తెల్లధనంగా మార్చుకుంటున్నారు.**

కానీ బ్యాంకింగ్ పన్ను విధానం వస్తే ప్రతి ఒక్కరూ పన్ను కట్టాల్సిందే కదా! అని అన్నారు.

▪ మీ ఆలోచనలు చాలా బాగున్నా ఈ సంస్కరణలు మొదలు కావాలంటే ప్రజలు రోడ్లపైకి వచ్చి పోరాడితే తప్ప వ్యవస్థ మారేలా లేదు అన్న ప్రశ్నకు..అశ్విని ఉపాధ్యాయ్ గారు అవును, ప్రజలు రోడ్లపైకి వస్తేనే ప్రభుత్వం దిగివస్తుంది అని జవాబు ఇచ్చారు.

ఈ "వన్ నేషన్ వన్ టాక్స్" అమలు కావాలన్నా దేశంలో కనీసం ఒకటో రెండో కోట్ల మంది ప్రజలు రోడ్లపైకి వచ్చి ఒక వారం రోజుల పాటు శాంతియుతంగా నిరసన తెలపాలి.
అప్పుడే ఈ సంక్లిష్టమైన చట్టాల వల తొలగిపోయి ప్రజల జీవితాలు సరళ తరం అవుతాయి. ఒత్తిడి లేని ఆర్థిక విధానాలతో బీపీ, షుగర్ లాంటి రోగాలు కూడా తగ్గుతాయి అని అన్నారు.

2025 జనవరిలో జస్టిస్ సంజయ్ కన్నా, జస్టిస్ సంజీవ్ కుమార్ బెంచ్ అశ్విని ఉపాధ్యాయ వేసిన కేసును విచారించి, సరైన ఫార్మాట్ లో, డ్రాఫ్ట్ లో పిటిషన్ సరిచేసి సంబంధిత హైకోర్టు ద్వారా ముందుకు సాగమని సూచించింది.

▪ కోర్టులు న్యాయవ్యవస్థ కూడా ఈ మార్పుల కొరకు తగిన రీతిన కేసులు విచారించి, దేశానికి ఉపయోగపడే విధంగా తీర్పులు ఇవ్వాలని భారతీయులందరూ కోరుకుంటున్నారు.

## ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్‌కు 'ఫేస్ ఆఫ్ ఇండియా--2026' గౌరవం

▪ విద్య, పరిశోధన, ఆవిష్కరణల్లో విశిష్ట సేవలకు గుర్తింపు
▪'అకడమిక్ విజనరీస్ ఆఫ్ ఇండియా' సిరీస్‌లో ఎంపిక
▪ పరిశోధన, డిజిటల్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యమిస్తున్న ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి



**కరపత్రం ప్రతినిది బ్యూరో, సెప్టెంబర్ 10**
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధికి ప్రతిష్ఠాత్మక 'ఇండియాస్పార్క్ ఫేస్ ఆఫ్ ఇండియా--2026' గుర్తింపు లభించింది. ఇండియాస్పార్క్ నిర్వహిస్తున్న 'అకడమిక్ విజనరీస్ ఆఫ్ ఇండియా' సిరీస్‌లో భాగంగా ఆయనను ఈ గౌరవానికి ఎంపిక చేశారు. ఇంజినీరింగ్ విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, సంస్థాగత నాయకత్వ రంగాల్లో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ గుర్తింపును ప్రకటించారు. ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మూడు దశాబ్దాలకు పైగా విద్యా, పరిశోధనా రంగాల్లో విశేష సేవలు అందిస్తున్నారు. స్మార్ట్ గ్రిడ్లు, పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రిక్ వాహన సాంకేతికత వంటి ఆధునిక రంగాల్లో ఆయన పరిశోధనలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందాయి. ఇప్పటివరకు 300కు పైగా పరిశోధనా పత్రాలు ప్రచురించడంతో పాటు ఆరు పుస్తకాలను రచించారు. ఐదు పేటెంట్లు ఆయన పేరిట నమోదుకాగా, 46 మందికి పైగా పీహెచ్‌డీ పరిశోధకులకు మార్గదర్శకత్వం వహించారు. ప్రతిష్ఠాత్మక జె.సి. బోస్ ఫెలోషిప్ అందుకున్న ప్రొఫెసర్ సుబుధి, ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజినీరింగ్ (ఐ ఎన్ ఏ ఈ)తో పాటు ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఐ ఈ టి), యూకే సంస్థల ఫెలోగా కొనసాగుతున్నారు. ఆయన విద్యా, పరిశోధనా రంగాల్లో చేసిన కృషికి దేశవ్యాప్తంగా గుర్తింపు లభించింది. 2023 నుంచి ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన, సంస్థలో పరిశోధన, ఆవిష్కరణలు, డిజిటల్ గవర్నెన్స్‌ను బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు. పరిశోధనకు అనుకూలమైన వాతావరణం కల్పించడం, యువ పరిశోధకులను ప్రోత్సహించడం, అంతర్జాతీయ విద్యా సంస్థలతో భాగస్వామ్యాలను విస్తరించడం వంటి చర్యలతో ఎన్ఐటీ వరంగల్ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఇండియాస్పార్క్ వ్యవస్థాపకురాలు, సీఈఓ రూపా తంతి మాట్లాడుతూ, ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధికి ఈ గుర్తింపును అందించడం తమకు గర్వకారణమని తెలిపారు. ఎన్ఐటీ వరంగల్‌లో ఆయన అందిస్తున్న పరివర్తనాత్మక నాయకత్వం, సుస్థిర ఇంధన రంగంలో చేస్తున్న పరిశోధనలు భారత ఆవిష్కరణ స్ఫూర్తికి నిదర్శనంగా నిలుస్తున్నాయని ఆమె పేర్కొన్నారు.

## కీసరలో అభివృద్ధి పనులకు శ్రీకారం

▪ భవాని రామలింగేశ్వర, సుభాష్ నగర్ కాలనీలలో సిసి రోడ్ల శంకుస్థాపన
▪ ముఖ్య అతిధి రామిడి స్వప్న విజయ్ రెడ్డి

**కరపత్రం ప్రతినిది సెప్టెంబర్ 10, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా.**
మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర డివిజన్ పరిధిలోని కీసర గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. ఈరోజు శ్రీ భవాని రామలింగేశ్వర కాలనీ మరియు సుభాష్ నగర్ కాలనీలలో పలు అభివృద్ధి పనులలో భాగంగా సిసి (కాంక్రీట్) రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కీసర డివిజన్ అధ్యక్షులు రామిడి స్వప్న విజయ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజ పాలనలో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తోందని అన్నారు.
కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సిసి రోడ్ల నిర్మాణంతో స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటమే కాకుండా, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండే సమస్య కూడా తగ్గుతుందని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

## వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాల సాధన కోసం ముందుకు సాగుదాం

▪ కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్




**కరపత్రం ప్రతినిది సెప్టెంబర్ 10,మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా.**
వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్ పిలుపు నిచ్చారు. సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకొని ఈసీఐఎల్ చౌరస్తాలోని ఆమె విగ్రహానికి గురువారం ప్రెస్ క్లబ్ సలహాదారులు ఎంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్, మాజీ అధ్యక్షుడు శనిగరం అశోక్, కోశాధికారి రామచంద్రమూర్తి, జర్నలిస్టులు పలుగుల పవన్, రమేష్, కీర్తి శ్రీనివాస్, దొమ్మాటి కిరణ్ కుమార్, గాదె రాములతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మెరుగు చంద్రమోహన్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె ప్రదర్శించిన ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సామాజిక అసమానతలు, దోపిడీ, వివక్షకు వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఆమె ఆశయాలకు అనుగుణంగా సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. చాకలి ఐలమ్మ కేవలం ఒక వర్గానికి చెందిన పోరాట యోధురాలు మాత్రమే కాదని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహనీయురాలని మెరుగు చంద్రమోహన్ అన్నారు. ఆమె త్యాగాలను భావితరాలకు తెలియజేస్తూ, ఐలమ్మ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

## ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

▪ వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ అయుబ్

**కరపత్రం ప్రతినిది వరంగల్,సెప్టెంబర్ 10**
భూమి కోసం,భుక్తి కోసం,వెట్టి చాకిరి విముక్తి కోసం వీరోచితంగా పోరాడిన చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వర్ధన్నపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఆమె చిత్రపటానికి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అయూబ్ మాట్లాడుతూ..అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.ఆమె ధైర్యం,తెగువ,పోరాట పటిమ మహిళా శక్తికి ప్రతీకగా నిలిచాయని పేర్కొన్నారు.ఐలమ్మ ఆశయాలను,పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని,తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన త్యాగాలను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న,టౌన్ అధ్యక్షుడు ఈగ దామోదర్, ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అట్టహాసంగా ప్రారంభమైన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు



**హుజూరాబాద్, కరపత్రం ప్రతినిది సెప్టెంబర్ 10**
హుజూరాబాద్ మండల స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, అండర్-17 బాలబాలికల క్రీడా పోటీలు బుధవారం స్థానిక ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని పోటీలను ప్రారంభించి, గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని క్రీడాకారులకు సూచించారు.మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ విద్యార్థులు తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి పోటీలను విజయవంతం చేయాలని కోరారు. ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి చిరుత శ్రీనివాస్ మాట్లాడుతూ.. మూడు రోజులపాటు పోటీలు కొనసాగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, మున్సిపల్ కౌన్సిలర్లు, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం సెప్టెంబర్ 11,2026

# కష్టకాలంలో అండగా నిలిచిన కౌన్సిలర్ పూర్ణాచారి

▪ బత్తుల శాంతమ్మ కుటుంబానికి నిత్యావసరాల సరుకుల పంపిణీ

**కరపత్రం ప్రతినిధి పరకాల, సెప్టెంబర్ 10**



గోరుకొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన బత్తుల శాంతమ్మ అనారోగ్యంతో ఇటీవల అకాల మరణం చెందడంతో ఆమె కుటుంబాన్ని పరకాల మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని ఓదార్పు పలికారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను అందజేసి తన వంతు సహాయాన్ని అందించారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పూర్ణాచారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మృతురాలి కుమారులు బత్తుల మల్లేశం, వెంకటేశ్వర్లు, విష్ణుమూర్తి, కుటుంబ సభ్యులతో పాటు వీర్ల సదానందం, సూదమల్ల రాజయ్య, పొడిచెట్టి సాంబమూర్తి, పప్పుల సుధాకర్, కుమార్ స్వామి, బూర వెంకటేశ్వర్లు, మంత్రి శ్యామ్, గంగోజుల విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# యాదవ సంఘం అధ్యక్షుడిగా మూగల కుమార్ యాదవ్

**కరపత్రం ప్రతినిధి వరంగల్ సెప్టెంబర్ 10**



హనుమకొండ: జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడిగా నియమితులైన ప్రముఖ విద్యావేత్త,షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్‌ను స్వేరోస్ నాయకులు ఘనంగా సన్మానించారు. స్వేరోస్ మాజీ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కుమార్ యాదవ్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యారంగంలో కుమార్ యాదవ్ చేస్తున్న సేవలు,యాదవ సమాజం పట్ల ఆయనకున్న నిబద్ధతకు గుర్తింపుగానే జిల్లా అధ్యక్ష పదవి దక్కిందన్నారు. అనంతరం కుమార్ యాదవ్ మాట్లాడుతూ తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ జిల్లాలోని యాదవుల సమస్యల పరిష్కారం,సంక్షేమం,అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పేద యాదవ విద్యార్థులకు విద్య, ఉపాధి అవకాశాల్లో చేయూతనందించడంతో పాటు విద్యాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో స్వేరోస్ నాయకులు ఒంటేరు చక్రి,బొచ్చు వినయ్,ఎల్తూరి సాయికుమార్,చెట్టుపల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల దీక్షకు స్వేరోస్ మద్దతు

**కరపత్రం ప్రతినిధి హనుమకొండ,సెప్టెంబర్ 10**




పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని,పాలిటెక్నిక్ విద్యార్థులకు నష్టం కలిగించే జీవో నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్(డీఎస్‌ఏ)ఆధ్వర్యంలో ఏకశిలా పార్క్ వద్ద చేపట్టిన నిరాహార దీక్షకు స్వేరోస్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా స్వేరోస్ నాయకులు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తవుతున్నా స్కాలర్‌షిప్‌లు,ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. జీవో 97తో పాలిటెక్నిక్ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం నిరాహార దీక్షలకే పరిమితం కాకుండా రాబోయే రోజుల్లో ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకువస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్వేరోస్ సీనియర్ నాయకులు,పరకాల కంటెస్టెంట్ కౌన్సిలర్ ఒంటేరు చక్రి,మాజీ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్,ఎస్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్,ఎస్ఎస్‌యూ కేడీసీ అధ్యక్షుడు చెట్టుపల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీల సమస్యలపై గళమెత్తిన సారయ్యకు సన్మానం

▪ కాంగ్రెస్ సీనియర్ నాయకులు అబ్దుల్ తాహిర్ ఆధ్వర్యంలో



**కరపత్రం ప్రతినిధి వరంగల్ సెప్టెంబర్ 10**

వరంగల్: మైనార్టీల సంక్షేమం,సమస్యలపై శాసనమండలిలో గళం వినిపించిన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అబ్దుల్ తాహెర్ తో పాటు పలువురు మైనార్టీ నాయకులు,సోదరులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సారయ్యను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. మైనార్టీల సంక్షేమ పథకాల అమలు, షాదీముబారక్,షాదీఖానాల అభివృద్ధి,మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలకు నిధుల విడుదల,పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు తదితర అంశాలపై సారయ్య శాసనమండలిలో ప్రశ్నించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. మైనార్టీల సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, కార్యకర్తలు, పలువురు సోదరులు పాల్గొన్నారు.

# జాతీయ అటవీ అమరుల త్యాగాలు చిరస్మరణీయం

▪ అడవుల పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన వీరులకు ఘన నివాళి
▪ ప్రకృతి పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత
▪ శ్రీనివాస రామానుజన్ విద్యాసంస్థల చైర్మన్, జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి

**కరపత్రం ప్రతినిధి హనుమకొండ, సెప్టెంబర్ 10**




అడవుల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన అటవీ అమరుల త్యాగాలు దేశానికి స్ఫూర్తిదాయకమని, వారి సేవలను ప్రతి భారతీయుడు చిరకాలం స్మరించుకోవాలని, ప్రకృతి సంరక్షణే వారికి ఇచ్చే నిజమైన నివాళి అని శ్రీనివాస రామానుజన్ విద్యాసంస్థల చైర్మన్, జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సెప్టెంబర్ 11న నిర్వహించే జాతీయ అటవీ అమరుల దినోత్సవం (National Forest Martyrsµ Day) సందర్భంగా అడవుల సంరక్షణ కోసం ప్రాణాలను అర్పించిన అటవీ అమరుల సేవలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని శ్రీనివాస రామానుజన్ విద్యాసంస్థల చైర్మన్, జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి పేర్కొన్నారు. దేశ సంపదైన అడవులను కాపాడేందుకు విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అటవీ అధికారులు, సిబ్బంది, అటవీ కార్మికుల త్యాగం ఎన్నటికీ మరువలేనిదని ఆయన అన్నారు. పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ, వాతావరణ సమతుల్యతను కాపాడడంలో అడవుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న అటవీ నరికివేత, పర్యావరణ కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం, అడవులను సంరక్షించడం తమ సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. ప్రకృతిని కాపాడితేనే భావితరాలకు సురక్షితమైన భవిష్యత్తును అందించగలమని తెలిపారు. జాతీయ అటవీ అమరుల దినోత్సవం సందర్భంగా అటవీ అమరులందరికీ ఘన నివాళులు అర్పిస్తూ, వారి త్యాగస్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి పిలుపునిచ్చారు. అడవుల పరిరక్షణకు ప్రజలంతా భాగస్వాములు కావాలని, పచ్చదనం పెంపొందించే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి కోరారు.

# భూమి ఆరోగ్య పరిరక్షణకు నూతన పోషక ఉత్పత్తులు దోహదం చేస్తాయి: ఈటల రాజేందర్

▪ రైతు ఖర్చు తగ్గించి, దిగుబడి పెంచే దిశగా సినర్జీ సంస్థ పరిశోధనలు అభినందనీయం

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, సెప్టెంబర్ 10**







వ్యవసాయ భూముల్లో పోషక లోపాలను సరిచేసి, నేలలోని పోషక సమతుల్యతను కాపాడుతూ పంటలకు అవసరమైన పోషకాలను సమర్థవంతంగా అందించే నూతన సంయుక్త పోషక ఉత్పత్తులను సినర్జీ సంస్థ గురువారం ఆవిష్కరించింది. ఈ ఉత్పత్తులను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆవిష్కరించి సంస్థ ప్రతినిధులను అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఒకప్పుడు కరువు, ఆకలి బాధలను ఎదుర్కొన్న భారతదేశం నేడు వ్యవసాయ రంగంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్. స్వామినాథన్ తీసుకొచ్చిన హరిత విప్లవం వల్ల దేశం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా, ఇతర దేశాలకు సైతం ఆహారం అందించే స్థాయికి ఎదిగిందని పేర్కొన్నారు. తెల్ల విప్లవం ద్వారా పాల ఉత్పత్తిలో, నీలి విప్లవం ద్వారా మత్స్య సంపద అభివృద్ధిలో భారత్ విశేష పురోగతి సాధించిందని చెప్పారు. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా దేశ ప్రజలకు అన్నం పెట్టే శక్తి వ్యవసాయానికే ఉందని, రైతు సంక్షేమమే దేశ అభివృద్ధికి మూలాధారమని అన్నారు. వ్యవసాయంలో సాంప్రదాయ ఎరువుల వినియోగాన్ని తగ్గించి, భూమికి అవసరమైన నత్రజని, పొటాషియం, జింక్ వంటి పోషకాలను శాస్త్రీయ పద్ధతిలో పంటలకు అందించే సాంకేతికతను సినర్జీ సంస్థ అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. నత్రజనితో పాటు గంధకాన్ని సమన్వయం చేసిన ఈ సాంకేతికత ద్వారా తక్కువ మోతాదులోనే సమర్థవంతమైన పోషకాలు పంటలకు అందే అవకాశం ఉందని వివరించారు.

ఈ విధానం విస్తృత స్థాయిలో విజయవంతమైతే ఎరువులపై ప్రభుత్వం భరిస్తున్న భారీ రాయితీ భారం కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని ఎంపీ వెలిబుచ్చారు. రైతుల ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, దిగుబడులను పెంచడం, పర్యావరణహిత వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, రసాయనాల దుష్ప్రభావాన్ని తగ్గించే దిశగా సినర్జీ సంస్థ చేపడుతున్న పరిశోధనలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

సినర్జీ సంస్థ పర్యావరణహిత ఉత్పత్తులతో రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతుండటం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ భాస్కర్‌తో పాటు వెంకట్ రెడ్డి, చంద్ర రెడ్డి, టీవీ రావు తదితరులు మరిన్ని పరిశోధనలు చేపట్టి రైతాంగానికి నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# తెలంగాణ సాధన ఉద్యమంలో క్రిస్టియన్ జేఏసీ పాత్ర కీలకం

▪ నకిలీ జేఏసీల పట్ల అప్రమత్తంగా ఉండాలి: చైర్మన్ జిలుకర రవికుమార్ స్పష్టం

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, సెప్టెంబర్ 10**



ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రైస్తవుల పక్షాన నిలిచి పోరాడిన ఏకైక సంస్థ 'తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ' మాత్రమేనని ఆ సంస్థ రాష్ట్ర చైర్మన్ జిలుకర రవికుమార్ స్పష్టం చేశారు. స్వరాష్ట్ర సాధన పోరాటంలో అప్పటి ప్రధాన జేఏసీ నేతలు ప్రొఫెసర్ కోదండరాం, శ్రీనివాస్ గౌడ్, దేవి వరప్రసాద్, అద్దంకి దయాకర్, మల్లెపల్లి లక్ష్మయ్య, స్వామి గౌడ్ తదితరులతో కలిసి క్రిస్టియన్ జేఏసీ చురుకైన పాత్ర పోషించిందని ఆయన గుర్తు చేశారు. ఉమ్మడి పది జిల్లాల్లో అనేక బహిరంగ సభలు, రాస్తారోకోలు, ధూంధాం వంటి ఉద్యమ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి, రాష్ట్ర ఆవిర్భావం వరకు నిరంతరం పోరాడామని తెలిపారు. అయితే, ఉద్యమ చరిత్ర లేని కొందరు వ్యక్తులు ప్రస్తుతం కొత్తగా 'తెలంగాణ జేఏసీ' పేరిట తెరపైకి వస్తున్నారని, సమాజం వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. నాటి ఉద్యమంలో క్రిస్టియన్ల తరఫున నిలిచింది తమ సంస్థ ఒక్కటేనని స్పష్టం చేశారు. ఈ ఉద్యమంలో క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ దాసరి శ్యామ్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల సారయ్య, చిలుకూరి రత్నరాజ్, ఖమ్మం ప్రసాద్, స్టీఫెన్, లుదియా పద్మతో పాటు కరీంనగర్ జిల్లా చైర్మన్ డి. జాన్, జాషువా, బి.ఎ. పాల్, ఉదయ్ కుమార్, సామ్యూల్ రాజ్, బాబన్న, జోసెఫ్ అబ్రహం, శైలేష్, జ్ఞానేందర్, రమేష్, ముప్పడి వెంకటేష్, జి. భాను, విశాల్ కుమార్, సురేందర్, బాలరాజ్, నోవా, తదితరులు పాల్గొని ఉద్యమాన్ని ముందుండి నడిపించారని ఆయన పేర్కొన్నారు.

# బీసీల ఐక్యతతోనే చాకలి అయిలమ్మ ఆశయాల సాధన: డాక్టర్ కె. సూర్యకిరణ్

▪ శాయంపేటలో వీరనారి చిట్యాల అయిలమ్మ విగ్రహానికి ఘన నివాళులు

**కరపత్రం ప్రతినిధి హనుమకొండ, సెప్టెంబర్ 10**





వీరనారి చిట్యాల అయిలమ్మ ఆశయాలను సాకారం చేయాలంటే బీసీ సమాజం ఐక్యంగా నిలిచి రాజ్యాధికార సాధన దిశగా అడుగులు వేయాలని బీసీ ఇంటెలెక్టువల్స్ ఫోరం హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ కె. సూర్యకిరణ్ పిలుపునిచ్చారు. బీసీ ఇంటెలెక్టువల్స్ ఫోరం హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం శాయంపేటలోని వీరనారి చిట్యాల అయిలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ కె. సూర్యకిరణ్ మాట్లాడుతూ.. బీసీలందరూ ఐక్యంగా సంఘటితమై రాజకీయంగా బలోపేతం కావడం ద్వారా మాత్రమే ఎజూఅయిలమ్మ కలలు కన్న సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల సమస్యల పరిష్కారంపై తగిన దృష్టి సారించడం లేదని ఆయన విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు కూడా ప్రజా సమస్యలపై సమర్థవంతంగా స్పందించకుండా తమ బాధ్యతలను విస్మరిస్తున్నాయని ఆరోపించారు. అగ్రకులాల ఆధిపత్యంలోని రాజకీయ పార్టీల్లో ఉన్న బీసీ నాయకులు ఏకమై ఒకే వేదికపైకి వచ్చి రాజకీయ ప్రత్యామ్నాయాన్ని నిర్మించి అధికారంలోకి రావడం ద్వారా చిట్యాల అయిలమ్మకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్లు తుమ్మ తిరుపతి, అశోక్ యాదవ్, డాక్టర్ కె. వీరస్వామి తదితరులు పాల్గొని అయిలమ్మ సేవలను స్మరించుకున్నారు.

# రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

**కరపత్రం ప్రతినిధి సికింద్రాబాద్, సెప్టెంబరు10**

రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు ఆయనను కలిసి ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు. సికింద్రాబాద్ బి-బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు జగదీశ్వర్ రావు ఆధ్వర్యంలో నాయకులు ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు అందజేశారు. ప్రజాసేవలో ఆయన నిరంతరం ముందుంటూ, భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిష్టించి, నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ నిరంతరం కృషి చేస్తూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నారని నేతలు కొనియాడారు. ఈ



కార్యక్రమంలో చిలకలగూడ డివిజన్ అధ్యక్షులు జహంగీర్, ముఖ్య నాయకులు శంకర్, ఖాజా, వినయ్ (సోనూ) తదితరులు పాల్గొని ఎంపీకి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా తమకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.